సాక్షి
వరంగల్

శనివారం । 4 । మార్చి । 2023



దోషులను కఠినంగా శిక్షించాలి

ధరావత్ ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ నాయక్ కోరారు. - 8లో▸



యోగాతో మానసికోల్లాసం

యోగాతో శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని, ఓరుగల్లు ప్రజలు యోగా శిక్షణలో పాల్గొనాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.9° /20.4°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

కనులపండువగా..



గీసుకొండ: మండల పరిధిలోని కొమ్మాల లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 11.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా వేదమంత్రాలతో అమ్మవార్లు భూదేవి, నీలాదేవితో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని గుట్టదిగువకు తీసుకెళ్లి అశ్వ వాహనంపై గుట్టచుట్టూ తిప్పి ఎదుర్కోళ్లను నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శేషగిరి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గడ్డమీది కుమారస్వామి, వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, శేషు, జెడ్పీటీసీ ధర్మారావు, సర్పంచ్ వీరాటి కవిత, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, బాలరాజు, స్వామి చౌహాన్ పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో సంస్కృతి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కక్కెర్ల శ్రీనివాస్ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



నల్లబెల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ కొనసాగించాలని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు మౌనిక అన్నారు. మండల పరిధిలోని మురళీనగర్‌లో సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం ఒక పండుగ కాదన్నారు. సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడి సాధించుకున్న దినంగా భావించాలన్నారు. స్త్రీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు సింగం సుమలత, సుగుణక్క, రాజక్క, కవిత, రాజమ్మ, శోభ, స్వరూప, భద్రమ్మ, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



గీసుకొండ: మండల పరిధిలోని జాతీయ అదర్శగ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్, అస్సాంతో పాటు మన రాష్ట్రానికి చెందిన 15 మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, కార్నెల్ సద్గురు ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్, బాస్కో రీచ్ అవుట్ గ్రామ్ వికాస్ ఫౌండేషన్, జేకేఆర్ ఫౌండేషన్‌కు చెందిన వీరంతా బాలవికాస సంస్థలో శిక్షణ పొందిన అనంతరం గ్రామాన్ని సందర్శించారు. ప్రజల భాగస్వామ్యంతో పలు కమిటీల ద్వారా గ్రామం సాధించిన విజయాలను, అభివృద్ధిని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, బాలవికాస ప్రతినిధి కొట్టె రమాదేవికి వివరించారు.

నిట్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ

- డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో గల ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లో రూ.65లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను నిట్ డైరెక్టర్ శుక్రవారం ప్రారంభించి.. మాట్లాడారు. త్రీడీ స్ప్రింట్ సాఫ్ట్‌వేర్‌తో ప్రొటోటైప్ ప్రొడక్ట్స్ ప్రింటింగ్‌కు, రీసెర్చ్ స్కాలర్స్, పారిశ్రామిక వేత్తలకు అనుగుణంగా, ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే సీమెన్స్‌లో 13 ల్యాబ్స్ ఉండగా.. త్వరలో 18 ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసి మూడేళ్లలో 30వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీమెన్స్ సీఈఓ, ప్రొఫెసర్ ఎల్.కృష్ణానంద్, సీమెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘాతోనే భద్రత



- ఎంజీఎంలో సీసీ కెమెరాలు పెంచాల్సిందే..
- ఉన్నవాటిలో సగానికి పైగా మొరాయిస్తున్న వైనం
- వాటిపై సరైన పర్యవేక్షణ ఉంటే మేలు
- ప్రీతి ఘటనతో కెమెరాల ఆవశ్యకతపై చర్చ

సాక్షి, వరంగల్: ఉత్తర తెలంగాణకే తలమానికమైన వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రిలో నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రతిరోజూ వెయ్యి మంది వరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో పాటు అవుట్ పేషెంట్లు కూడా వేలల్లో ఉండడంతో ఈ బడా ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రతా పరంగా సీసీ కెమెరాలు పెంచాలి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) అనస్తీసియా తొలి సంవత్సర కోర్సు చదువుతున్న ధరావత్ ప్రీతి ఘటన ఎంజీఎం ఆస్పత్రిలోనే జరగడంతో అందరి దృష్టి సీసీ కెమెరాల వైపు మళ్లింది. అయితే ఇంత పెద్ద బడా ఆస్పత్రిలో కేవలం 30 సీసీ టీవీ కెమెరాలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా అప్పుడప్పుడూ మొరాయిస్తుండడంతో మరమ్మతులు చేయించి నిర్వహిస్తున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) ఆదేశాల మేరకు ఈ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు బిగించామని ఆర్‌ఎంఓ మురళీ అంటున్నారు. ఎంజీఎం ఆస్పత్రి, కరోనా వార్డు కలుపుకొని 30 వరకు నిఘా నేత్రాలు ఉన్నా.. పర్యవేక్షణ లోపంతో ప్రధాన వార్డుల్లో చాలా వరకు ఉన్న సీసీటీవీ కెమెరాలు అప్పుడప్పుడూ పనిచేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రీతిలాంటి ఘటన ఏదైనా జరిగిన సమయంలో ఈ నిఘా నేత్రాలే కీలకంగా ఉంటాయి. ఈ ఫుటేజీలకు చిక్కిన దృశ్యాలు ఏకంగా కేసును ఛేదించే స్థాయి వరకు తీసుకెళ్తాయి.



ఇంకా పెంచాల్సిందే..

దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 1,300 పడకలు ఉన్న ఈ బడా ఆస్పత్రిలో రోజుకు రోగులు వేలల్లో వచ్చి వెళ్తుంటారు. రోగి సీరియస్‌గా ఉన్న సమయాల్లో వైద్యులు, సిబ్బందితోనూ గొడవలు జరుగుతుంటాయి. చికిత్స పొందుతున్న రోగులతో పాటు బంధువుల సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు చోరీకి గురవుతున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. వీటికి తోడు కొందరు సెక్యూరిటీ సిబ్బందికి రోగుల బంధువులు చేతి తడిపితే తప్ప లోపలికి వెళ్లనివ్వరనే వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయిన దాఖలాలు ఉన్నాయి. ఆస్పత్రి ప్రాంగణాల్లోనూ పార్క్ చేసిన రోగుల వాహనాలు మాయమైన ఘటనలు ఉన్నాయి. సీసీ కెమెరాలను మరిన్ని పెంచితేనే వీటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

నిర్వహణ లోపంతోనే..

వీటన్నింటికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో డాక్టర్ మనోహర్ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పార్టనర్ (పీపీపీ) పద్ధతిలో ఓ ప్రైవేట్ కంపెనీ సీసీ కెమెరాలను ఆస్పత్రిలో బిగించింది. ఓ రెండేళ్ల పాటు బాగానే ఈ నిఘా నేత్రాలు పనిచేయడంతో చాలా వరకు ఘటనలు తగ్గాయి. ఆ తర్వాత వీటి నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో ప్రధాన ఘటనలు జరిగినప్పుడు కూడా సీసీటీవీ ఫుటేజీ అందుబాటులో ఉండడం లేదన్న టాక్ వస్తోంది. అందుకే సిబ్బంది చేతివాటం కూడా మళ్లీ మొదలైందన్న వాదన వినబడుతోంది. అందుకే ఈ తరహా ఘటనలు తగ్గాలంటే ప్రధాన వార్డుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు పెంచాలని, ఉన్న నిఘా నేత్రాలన్నీ పనిచేసేలా చూడాలన్న డిమాండ్ రోగుల నుంచి వినిపిస్తోంది. "ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పెంచాలి. అవినీతి ఆగాలన్న, వైద్యులపై దాడులు ఆగాలన్న, వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలన్న, ఏదైనా ఘటన జరిగినా దాన్ని ధ్రువీకరించాలన్న సీసీ కెమెరాలు అవశ్యం. ముఖ్యంగా పిల్లల వార్డు నుంచి పిల్లలు అపహరణకు గురికాకుండా ఉండేందుకు కూడా ఇవి ముఖ్యమే. వీటిని బిగించడమే కాదు పర్యవేక్షించడానికి ప్రత్యేక వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉంది"అని ఎంజీఎంకు వచ్చిన ఓ రోగి బంధువు వెంకటేశ్వర్లు అన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



బుధరావుపేటలో పరీక్ష పత్రాల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న శంకరయ్య

- ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ కో ఆర్డినేటర్ శంకరయ్య

నర్సంపేట: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ కో ఆర్డినేటర్ వి.శంకరయ్య అన్నారు. నర్సంపేటలోని ద్వారకపేట రోడ్డులోని బాలుర పాఠశాలను స్టేట్(ఎస్‌సీఈఆర్‌టీ) సపోర్టింగ్ టీమ్ సభ్యులు శుక్రవారం సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ, ప్రశ్న పత్రాల మూల్యాంకన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా ప్రణాళికతో బోధన నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరిగేలా మోటివేషన్ చేయాలని సూచించారు. పరీక్షా సమయంలో సమయపాలన పాటించే మెలకువలను విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తరగతుల వారీగా పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎస్‌ఆర్‌జీలు సీహెచ్.శ్రీనివాస్, డి.అనిల్‌కుమార్, ఏఎంఓ మాలోతు సారయ్య, ఎంఈఓ రత్నమాల, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

ఖానాపురం: పదో తరగతి విద్యార్థులు భయాందోళనకు గురి కాకుండా పరీక్షలు రాయాలని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ శంకరయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఖానాపురం, బుధరావుపేటలోని మోడల్ స్కూళ్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ, ప్రశ్నపత్రాల మూల్యాంకాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, ధైర్యం పెరిగేలా అవగాహన కల్పించారు. ప్రగతి నివేదికలను తరగతుల వారీగా పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పరీక్షల్లో పేపర్ల కుదింపు, విద్యార్థుల సమస్యలు, ప్రత్యేక తరగతుల షెడ్యూల్, విద్యార్థులకు స్నాక్స్ అందజేత అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సమయానికి హాజరు కావాలని సూచించారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



నర్సంపేట: మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల శ్రీనివాస్ ఆంగ్లంలో డాక్టరేట్‌ను శుక్రవారం అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ విభాగం పరిశోధకులు శ్రీనివాస్ గాంధీయన్ ఐడియాలజి కింద 'సెలెక్ట్ నావల్స్ ఆఫ్ రాజారావు, ముల్క్‌రాజ్, ఆనంద్, ఆర్‌కె.నారాయణ్ 'అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. దీనికి గాను డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంగ్లిష్ విభాగం ఆచార్యులు మేఘనారావు ఆధ్వర్యంలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. దీంతో శ్రీనివాస్‌ను స్థానికులు, అధ్యాపకులు, పరిశోధకులు అభినందించారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు

- నేడు నైతికత, మానవ విలువలు.. 6న పర్యావరణ విద్య పేపర్లు
- హాజరు కానున్న 6,817 మంది విద్యార్థులు

కాజీపేట సెంటర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నేటి నుంచి నిర్వహించే పరీక్షలకు తప్పనిసరి హాజరు కావాలని అధికారులు నిర్దేశించారు. ఈ మేరకు నేడు నైతిక, మానవ విలువలు, 6వ తేదీన మానవ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 6,817 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 5,781 మంది జనరల్ విద్యార్థులు కాగా ఒకేషనల్ కోర్స్ విద్యార్థులు 1036 మంది ఉన్నారు. ఈ పరీక్షలు ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, మైనార్టీ రెసిడెన్షియల్ తదితర కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు హాజరు కాకపోతే వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులైన ఫేల్ మెమో వస్తుంది కనుక విధిగా ప్రతీ విద్యార్థి పరీక్షలకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షలు రాయడం తప్పనిసరి



నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాము. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు కె.జితేందర్ రెడ్డి, కె.శ్రీధర్ పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. ఏ రోజు పేపర్ ప్రశ్నపత్రం అదే రోజు నెట్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించాము. అందరు విద్యార్థులు విధిగా పరీక్షలకు హాజరు కావాలి.

- కాక మాధవ రావు,
ఇంటర్ విద్యాశాఖ అధికారి

రాజకీయ ప్రభలకు షరతులతో అనుమతి

- కొమ్మాల జాతరలో డీజేలు, రాజకీయ జెండాలు, ఫ్లెక్సీలు నిషేధం
- గొడవలు చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులు
- ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్
- కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద కోఆర్డినేషన్ మీటింగ్



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్

గీసుకొండ: ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు రాజకీయ ప్రభలను షరతులతో అనుమతిస్తామని ఈస్ట్‌జోన్ డీసీపీ పి.కరుణాకర్ అన్నారు. మండల పరిధిలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద గీసుకొండ, దుగ్గొండి మండలాల రాజకీయ నాయకులతో శుక్రవారం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ ప్రభలకు పార్టీ జెండాలు కట్టి జాతరకు తీసుకుని రావద్దని, అలాగే కర్రలు పట్టుకుని రావద్దన్నారు. డీజేలు, రాజకీయ ఫ్లెక్సీలకు జాతర వద్ద అనుమతి లేదన్నారు. జాతరలో గొడవలు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రభలను తీసుకుని వచ్చే వారు ముందుగా ఆయా పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో తమ అండర్ టేకింగ్ ఇవ్వాలన్నారు. ఎలాంటి గొడవలు జరిగినా తమదే బాధ్యత అంటూ ఆయా పార్టీల నాయకులు పత్రాలపై సంతకాలు చేసి బాధ్యత తీసుకోవాలన్నారు. కాగా ఈ సారి జాతరలో రాజకీయ ప్రభలను అనుమతించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మోహన్‌రెడ్డి, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి గోనె కుమారస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ పోలీసు అధికారులను కోరారు. జాతరలో మద్యం ధరలను అదుపు చేయాలని, సైకిల్ స్టాండ్ వద్ద ఎక్కువ వసూలు చేయడాన్ని నియంత్రించాలని కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ కోరారు. మామునూరు, పరకాల, నర్సంపేట ఏసీపీలు కృపాకర్, శివరామయ్య, సంపత్‌రావు, తహసీల్దార్ విశ్వనారాయణ, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సైలు వెంకన్న, నవీన్ కుమార్, శ్వేత, ఆలయ ఈవో శేషగిరి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, సర్పంచ్ కవిత, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రభలకు అనుమతి తీసుకోవాలి..

జాతరకు రాజకీయ ప్రభలను తీసుకుని వచ్చేవారు ముందుగా నేడు సాయంత్రం 5 గంటల లోపు పోలీస్‌స్టేషలో దరఖాస్తు చేసుకోవాలి.. అనుమతి తీసుకున్న తరువాతే ప్రభలను తీసుకెళ్లాలని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చేవరకూ పోరాటం



అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

వరంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చే వరకూ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్ల సాధనకు సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండోరోజూ కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచేవరకూ పోరాటం చేస్తామన్నారు. రెండు రోజులుగా అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. టీఏ, డీఏ కల్పించడంతో పాటు ఆన్‌లైన్ సిస్టం రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.5లక్షలకు, ఆయాలకు రూ.3లక్షలకు పెంచాలన్నారు. ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, బీఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సాగర్ మద్దతు ప్రకటించారు. అంతకు ముందు అంగన్‌వాడీ ఉద్యోగులు 20డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటకు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ రెండో రోజూ ధర్నాలో అంగన్‌వాడీలు రుక్మిణి, నిర్మల, లక్ష్మి, ఆదిలక్ష్మి, భవాని, భారతి, అనిత పాల్గొన్నారు.

సామాన్యులపై మోయలేని భారం



నర్సంపేట: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారాలను మోపుతుందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అన్నారు. ఈ మేరకు పట్టణంలో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడారు. 19కేజీల కమర్షియల్ సిలిండర్‌కు రూ.350, డొమెస్టిక్ సిలిండర్‌కు రూ.50పెంచడంతో సామాన్యులపై భారం పడిందన్నారు. ఒక వైపు నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేదలు ఇబ్బందులు పడుతుంటే మరో మారు గ్యాస్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరిచేలా చేసిందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకుంటే మహిళల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యురాలు జన్ను జమున, భవాని, ప్రియాంక, అరుణ, మణెమ్మ, పద్మ, మల్లేష్, స్వామి, వెంకటయ్య, అజయ్, అనిల్, శారద, అప్సర, కోమల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గ్యాస్‌ను దూరం చేసే కుట్ర..

దుగ్గొండి: నిరుపేదలకు వంట గ్యాస్‌ను దూరం చేసే కుట్రలో భాగంగానే కేంద్రం గ్యాస్ ధరను విపరీతంగా పెంచుతుందని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు అన్నారు. మండల పరిధిలోని రేబల్లెలో పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం కట్టెల పొయ్యిపై వంటచేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల కాలంలో రూ. 400 నుంచి 1200లకు గ్యాస్ ధరలను పెంచిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఎండి.రాజాసాహెబ్, సర్పంచ్ గటిక మమత, పేరబోయిన చేరాలు, ఐలోని, రమ, గటిక లలిత, లాసాని బాబురావు, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం సమకూర్చుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి కల్పన



దుగ్గొండి: డంపింగ్‌యార్డులో కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ కల్పన

దుగ్గొండి: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టి సాధించడానికి సొంత ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. మండల పరిధిలోని పొనకల్ గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులను డీపీఓ శుక్రవారం తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనం, గ్రామ నర్సరీ, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులతో పాటుగా కంపోస్టు ఎరువును పరిశీలించారు. గ్రామ సర్పంచ్ బొమ్మగాని ఊర్మిళ, పంచాయతీ కార్యదర్శి గుర్రపు కవితను అభినందించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్, ఉప సర్పంచ్ బుస్సారి తిరుపతి, వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



పర్యటిస్తున్న కమిషనర్ ప్రావీణ్య, అధికారులు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య శుక్రవారం పర్యటించారు. కీర్తినగర్‌లో మినీ స్టేడియం, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు బండ్‌ల అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయిస్తామని ఆమె తెలిపారు. జాన్‌పాక శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్, డీఈ రవికిరణ్, ఏఈ కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

4 మిషన్లు.. 40 టిప్పర్లు

విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ కీలకం

టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వివరాలు 10లో▸

క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం పట్టణంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతుండడమే గాకుండా సరైన కాగితాలు లేవన్నారు. పత్తి నిరంజన్, వడ్డెపల్లి రామకృష్ణ, కట్కూరి సృజన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సును వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో బస్సు వెనుక భాగం దెబ్బతిన్న సంఘటన శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేట బస్టాండ్‌కు వెళ్తున్న క్రమంలో వరంగల్ వైపు వెళ్తున్న బొగ్గు లోడు లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం బాగా దెబ్బతింది. అంతకు ముందే ప్రయాణికులు వర్ధన్నపేట పాత బస్టాండ్ వద్ద దిగిపోవడంతో ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం



వర్ధన్నపేట: కిరాణ షాపుకు వెళ్లి వస్తానని తన కూతురు తిరిగి రాలేదని వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండలంలోని బండౌత పురం గ్రామానికి చెందిన మంచాల యాకయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురి వివాహం చేశారు. చిన్న కూతురు అఖిల ఈ నెల 14న సాయంత్రం కిరాణసామానుకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

రూ.1.72 లక్షలు మాయం

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి వారు అడిన వివరాల తెలపడంతో రూ.1,72,291లను పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. బాధితుడికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలని సూచించగా నిజమేనని నమ్మి వారు అడిగిన వివరాలను చెప్పడంతో బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం అయ్యింది. బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.




జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు



హాజరైన కలెక్టర్లు, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్

యోగాతో మానసికోల్లాసం



దినచర్యలో భాగం చేసుకోవాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా ప్రారంభమైన యోగా మహోత్సవ్



యోగా చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని, ఓరుగల్లు ప్రజలు యోగా శిక్షణలో పాల్గొనాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకు ముందు యోగా గురువు, పద్మవిభూషన్ దాజీ (కమలేష్ దేసాయి భాయ్ పటేల్)ను స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కన్హా శాంతివనం తరహాలోనే ఓరుగల్లు సమీపంలో శాంతివనాన్ని నిర్మించడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన భారతదేశంలో యోగా పట్ల ఆసక్తిని కలిగించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను ఆచరిస్తున్నారని, ధ్యానంతో మనసు ప్రశాంతత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, సీపీ ఏవీ రంగనాథ్, కేయూ వీసీ ఆచార్య రమేష్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, విద్యార్థులు, అధికారులు పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.

మంత్రి ఫోన్ పోయిందంటూ హైరానా

చిల్పూరు: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చెందిన ఫోన్ పోయిందని తెలపడంతో అధికారులు, పోలీసులు, నాయకులు కొద్ది సేపు హైరానా పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద చోటు చేసుకుంది. వివరిలాల ఉన్నాయి..వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణానికి హాజరైన మంత్రితో పాటు ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డిలు హాజరయ్యారు. స్వామివారి తలంబ్రాలు సమర్పించిన అనంతరం వెలుతున్న క్రమంలో తన మొబైల్ ఫోన్ కనిపించడం లేదని తెలపడంతో అందరు హైరానా పడ్డారు. మైకులో సైతం ప్రచారం చేశారు. కాసేపటికి చైర్మన్ శ్రీధర్‌రావు, అర్చకులు స్వామివారి మహిమతో ఫోన్ దొరికిందంటూ మైకులో తెలిపారు. ఇంతకీ ఆ ఫోన్ మంత్రి గారి కారులోనే ఉందనడంతో సంతోషపడ్డారు.



యోగా చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, వీసీ, తదితరులు

భార్యపై భర్త దాడి..

- ఐరన్ పైపుతో కొట్టడంతో తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: భర్త వేధింపులు తాళలేక ఇద్దరి పిల్లలతో కలిసి పుట్టింటిలో తలదాచుకుంటున్న ఓ మహిళను అకస్మాత్తుగా రోడ్డుపై భర్త ఐరన్ పైపుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన శుక్రవారం శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చోటు చేసుకుంది. బాధితురాలి తల్లి గద్దల శారద తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీకి చెందిన గద్దల శారద కుమార్తె సరిత (27)ను పదేళ్ల క్రితం నర్సంపేట మండలం నాగుర్లపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల రఘు (30)కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. రఘు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సరిత, ఇద్దరు పిల్లలు పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రఘు మద్యానికి బానిసై భార్య సరితను కొట్టడంతో వరంగల్ నాగేంద్రనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తల పంచాయితీ పలుమార్లు గ్రామ పెద్దల ఎదుట జరిగింది. పద్ధతి మార్చుకుంటానని చెప్పి భార్య, పిల్లలను తీసుకెళ్లి మళ్లీ చిత్ర హింసలకు గురిచేయడంతో సరిత పిల్లలతో కలిసి పుట్టింటిలో ఉంటుంది. ఈ విషయమై రెండేళ్ల క్రితం వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సరిత కేసు పెట్టింది. ఇద్దరి పిల్లలను శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ తాను వరంగల్ చౌరస్తాలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం గడుపుతుంది. శుక్రవారం ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించి షాపుకు బయలుదేరుతున్న సమయంలో అకస్మాత్తుగా సరిత భర్త రఘు కాపురానికి రాకుంటే చంపేస్తానంటూ ఐరన్ పైపుతో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భారీగా స్థానికులు రావడంతో రఘు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ఎంజీఎంకు తరలించారు. సరిత తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినా.. సకాలంలో స్పందించలేదని, స్థానికులు అడ్డుకోవడంతోనే రఘు అక్కడి నుంచి పారిపోయాడని, లేదంటే ఎక్కువ గాయాలయ్యేవని సామాజిక కార్యకర్త ఫసీ తెలిపారు.



భర్త దాడిలో గాయపడిన సరిత

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- సహకరించిన ఇద్దరు కూడా..
- రూ.6లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- జనగామ డీసీపీ పి.సీతారాం వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగతో పాటు సహకరించిన ఇద్దరిని జనగామ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసిన డీసీపీ సీతారాం అరెస్ట్ వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా రాఘవాపూర్‌కు చెందిన మునిగండ్ల వి జయ్ తాగుడుకు బానిసగా మారి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం కూడా గడిపాడు. అనేక సార్లు జైలుకు వెళ్లి శిక్షలు అనుభవించినా, విజయ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు మరో ఇద్దరి దొంగలతో చేతులు కలిపి గత నెల ఖమ్మం జిల్లా పాల్వంచ నవభారత్ వీధిలో చోరీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి గత నెల 20న జనగామకు వచ్చారు. పట్టణంలోని వాసవీ కాలనీ నివాస ముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివగారి కిరణ్, రజని ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం పక్కా సమాచారంతో ప్రెస్టన్ మైదానం నుంచి పారిపోయే క్రమంలో పట్టుకున్నారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం, వెంకటాపూర్‌కు చెందిన వరిపెల్లి సందీప్ అలియాస్ సన్నీ (26) తన తమ్ముడు రాజుతో కలిసి వరంగల్ నగరంలో నివాసం ఉంటూ హంటర్‌రోడ్డులోని టిఫిన్ బండిపై మాస్టర్ కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.



భిక్షపతి మృతదేహం

మోపెడ్ అదుపు తప్పి..

బచ్చన్నపేట: మోపెడ్ వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మన్‌సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంజాల భిక్షపతి (60) గ్రామంలో పోస్టుమెన్ ఇస్తున్న పెన్షన్‌ను తీసుకోవడానికి మోపెడ్ వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కిల్లర్‌పై పీడీ యాక్ట్

వరంగల్ క్రైం: సుపారీ తీసుకొని హత్యలకు పాలపడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం రత్నాకర్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి నిందితుడికి శుక్రవారం కరీంనగర్ కారాగారంలో అందజేసిన అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గత సంవత్సరం కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద సుపారీ తీసుకొని ఆమె భర్తను దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనలో సుపారీ కిల్లర్‌తో పాటు సుపారీ ఇచ్చిన మహిళతో సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గతంలో రాచకొండ, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయబడుతాయని సీపీ హెచ్చరించారు.



నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాలు అందజేస్తున్న పోలీసులు

సాక్షి క్లాసిఫైడ్స్

తన ప్రేమను నిరాకరించిందని..

- రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కాజీపేట రూరల్: తాను ప్రేమించిన అమ్మాయి దక్కదని జీవితంపై విరక్తి చెంది ఓ బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట, కోమటిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె. దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన పాలమేని నరేష్ (20) మహేశ్వరంలోని ఓ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను నిరాకరించిందని జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకొని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో డౌన్ మార్గంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు...

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో శుక్రవారం ఇప్పకాయల శివ (25) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని మానసిక కుంగుపాటుతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి భాగ్యరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షుకుర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వైద్యుడు..



సారంగపాణి (ఫైల్)

నెక్కొంద: కుటుంబ కలహాలతో ప్రైవేట్ వైద్యుడు గద్దం సారంగపాణి (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండలోని హైస్కూల్ సెంటర్‌లో మహేశ్వర ఆస్పత్రి వైద్యుడు కొంత కాలంగా భార్య విజయతో గొడవ కారణంగా భార్యభర్తలు విడాకులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వాలని భార్య డిమాండ్ చేయడం, పరువు పోతుందనే మనోవేదనతో నాలుగు రోజుల క్రితం సారంగపాణి ఉరి వేసుకోగా స్థానికులు గమనించి కాపాడారు. మళ్లీ ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో విబేధాలు ఉండటంతో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం



విద్యార్థులతో మాట్లాడుతున్న షీటీం పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్న పాఠశాల వద్ద ప్రతిరోజు సాయంత్రం సమయంలో ఆకతాయిలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం 'సాక్షి'లో 'విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన షీటీం పోలీసులు శుక్రవారం సాయంత్రం షీటీం ఏసీపీ డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ సంజీవరావుల నేతృత్వంలో పాఠశాలకు వచ్చే దారిలో ఉన్న 12 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకు షీటీం పనిచేస్తాయన్నారు. ఎలాంటి సమయాల్లోనైన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్‌లో గాని, సోషల్ మీడియాలోనైన వేధింపులకు గురిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలను వేధిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. అనంతరం అదుపులోకి తీసుకున్న ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు విద్యాసాగర్, కుమారస్వామి, ఎస్‌ఐ స్వాతి, ఏఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, రాంరెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

ప్రీతి ఘటనలో విచారణ వేగవంతం

- రెండో రోజు సైఫ్‌ను విచారించిన పోలీసులు

ఎంజీఎం: ప్రీతి ఘటనలో పోలీసుల విచారణ వేగవంతంగా కొనసాగుతుంది. రెండు రోజులుగా సైఫ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. శుక్రవారం విచారణలో పోలీసులు మరింత పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ప్రీతికి సంబంధించిన సెల్‌ఫోన్ సమాచారం వివరాలతో పోలీసులు కేసు మిగతా ఆధారాల కోసం ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. ప్రీతి సెల్‌ఫోల్‌లో 27 స్క్రీన్ షాట్స్, మెస్సేజ్‌లు కిలకంగా మారినట్లు వెల్లడవుతోంది. మెడికో, ఎల్‌డీడీ నాకౌట్ వాట్సాప్ గ్రూపుల నుంచి, మరో ముగ్గురు వైద్యుల నుంచి మెసేజ్‌లు సేకరించారు. సేకరించిన వాటిపై పోలీసులు సైఫ్ నుంచి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఘటన స్థలంలో ఉన్న హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సు నుంచి కూడా మరిన్ని వివరాలు రాబట్టినట్లు చర్చించికుంటున్నారు. ప్రీతి వాడిన హ్యాండ్ బ్యాగ్‌లో ఏయే వస్తువులు ఉన్నాయనే వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. ఘటన రోజు విధులు నిర్వర్తించిన సెక్యూరిటీ గార్డుల నుంచి కీలకమైన అంశాలను సేకరించినట్లు ఎంజీఎంలో సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. సైఫ్ నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలను పోల్చుతూ విచారణ కొనసాగిస్తున్నారు. కేసు పురోగతిపై త్వరలోనే కొలిక్కి తేస్తారనే వాదన వినిపిస్తోంది.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

కొడకండ్ల: బంగారు భవిష్యత్ కలిగిన బంజార బిడ్డ ధరావత్ ప్రీతి చదువు దుర్మార్గుడి ర్యాగింగ్‌కు బలవడం విచారకరమని, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని గిర్నితండాలో ప్రీతి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ సీటు ప్రభుత్వ కళాశాలలో సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రీతి మృతి కుటుంబానికి కాదని, సమాజానికి తీరని లోటన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో దర్యాప్తు చేయిస్తుందని, సీపీ రంగనాథ్ నేతృత్వంలో నిస్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులకు శిక్ష పడేలా చేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవాసంఘ్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌నాయక్, హేమనాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

హన్మకొండ: డాక్టర్ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రీతి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ క్యాండిల్స్ వెలిగించారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ వైద్య విద్యార్థిని ప్రీతి మరణం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, జిల్లా కార్యదర్శి తోపుచర్ల అర్చన, కేతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారైనట్లు వారు తెలిపారు. స్థానిక కొత్తకాలనీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇదే సమయంలో వరంగల్‌కు చెందిన వి. రాజు, జగ్గన్నపేటకు చెందిన ఎల్. రవీందర్ ధారకొండ నుంచి గంజాయిని ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ధారకొండకు చెందిన కొర్రా ముకుంద అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.